# * మూడవ బహుమతి పొందిన కథ *

"మీరెంత ఇబ్బంది పడి చదివిస్తున్నారో నాకు తెలుసు. నా కోసమని మురళి ఎన్ని అవకాశాలకు దూరమవుతున్నాడో కూడా నాకు తెలుసు. కాని చదువు మీది ఈ వ్యామోహం నన్ను ముందుకు లాక్కుపోతున్నది. ఏడాదితో ఇది పూర్తి అయి నా కాళ్ల మీద నేను నిలబడినపుడు మీ ఇద్దరి ఋణాన్ని చేతనయ్యింతవరకు తీర్చుకో యత్నిస్తాను. అందాక క్షమించండి"

అంటూ రాశాడు వేణుగోపాలం.

కాలేజీ వాళ్లతో కలిసి ఏవో వూళ్ళు తిరిగి రావడానికి అయిదారు వందలు కావాలని రాస్తే పంపాడు. అందుకోసం పెద్దవాడే రామాయణమంతా రాశాడు. వాడెప్పుడూ ఇంతే—అనుకున్నారు హరిహర శాస్త్రిగారు.

వేణులో తానున్నాడు. మురళిలో వాళ్లమ్మ వుంది. దీపంవలె ఇంటో ఒక ఆడపిల్ల నడయాడాలని లక్ష్మి ఎంతో ఆశించింది. కాని ఆ వాసుదేవుడికి దయలేక పోయింది. పుట్టని కూతురిని వెతుక్కుంటూ వెళ్లిపోయింది లక్ష్మి. ఈ భవబంధాలన్నీ ఎందుకు తెంచి వేస్తున్నావో తెలియులేవయ్యా కృష్ణా అనుకున్నారు శాస్త్రి.

పట్నాలకు వెళ్లడం—పెద్దచదువులు చదవడం—ఊళ్లు తిరగడం, ఇవన్నీ నా చేత కావు బాబూ... ఉన్న రెండెకరాలూ దున్నుకుంటూ ఇంటిపట్టున పడివుండక ఎందుకొచ్చిన తిప్పలు—అంటాడు మురళి.

జ్ఞానం ఒక జ్యోతి—చదువొక వెలుగు. దానిని వెంబడించాలి. అన్నిటిని చూడాలి. ఎందరినో కలవాలి. జీవితాన్ని చదవాలి—ఇది వేణు.

తృప్తి నీడలో బ్రతుకుతున్నాడు వీడు.

తృష్ణ కొంగు పట్టుకు పరుగులిడుతున్నాడు వాడు.

ఒక్కచెట్టున కాచిన ఫలాలివి! నవ్వుకున్నారు హరిహరశాస్త్రిగారు. వీధిలోకి చూశారు.

ఎండవచ్చినా ఎరుపు చావలేదాకాశం మీద. పశువులు ఇళ్లకు చేరుతున్నాయి. వాటి గిట్టల నుండి లేచిన ధూళి ఆకాశానికి నిచ్చెనలు వేస్తున్నాయి. గొల్లవాడొకడు గేదె మీద అడ్డంగా కూచుని పరమానందంతో పిల్లనగ్రోవి వూదుతోన్నాడు.

'మన్దం మన్దం మధుర నినదైర్వేణు
మాపూరయన్తం
బృన్దం బృన్దావన భువి గవాంచారయన్తం
చరన్తం...'

అని ఆలపించారు శాస్త్రిగారు.

"నమస్కారాలు బాబుగారూ!" అని నమస్కరిస్తూ వీధికి అవతల వైపుగా తొలగి నడుచుకుంటూ వెళ్లాడు కరణంగారు.

అపుడే పొలం నుండి వస్తున్న, మురళి ఇది గమనించాడు. నాన్నగారిని చూశాడు.

విశాలమైన ఫాలభాగం. ఎప్పుడూ కానవచ్చే ఎర్రటిబొట్టు. చేతికి మురుగులు. గంభీరమైన విగ్రహం. దివ్యతేజంతో అలరారే ఆ కళ్ళు..

మెడ వెనుక చేతులానించి, కండ్లు మూసుకుని వీధి అరుగు మీద కూర్చుని వున్న తండ్రిని చూసి మళ్లీ తెలుసుకున్నాడు మురళి— ఆయనను చూసిన క్షణం కరణమయినా కలెక్టరయినా భక్తి భావంతో తలవంచి ప్రణమిల్లి మరీ ఎందుకు కదులుతారో!.. నియమబద్ధమైన జీవితం, నీతి తప్పని జీవితం, మనిషికిచ్చే అధికారాలలో ఇదొక్కటి కాబోలు అనుకుని, ఆయనకు నమస్కరించి, లోపలికి అడుగువేశాడు.

"మధ్యాహ్నం భోజనానికి రాలేదేమిరా?" అని అడిగింది అమ్మమ్మ. ఆమెకు జవాబు చెప్పి స్నానంచేసి వీధిలోకి వచ్చాడు మురళి.

"ఇదిగో మీఅన్నయ్య వుత్తరం"అంటూ పడేశారు శాస్త్రిగారు. చదివాడు మురళి.

"అన్నయ్య ఉత్త పిచ్చివాడు" అన్నాడు. శాస్త్రిగారు నవ్వారు.

"అయిదు వందలూ ఎట్లా పంపారూ? మనియార్డర్ చేసినట్లు లేదే" అన్నాడు మురళి. తామున్న పంపాపురానికి ఆరు మైళ్లవతల వున్న 'దివ్వె' పోస్టాఫీసుకు వెళ్లితే తానే వెళ్లి వుండాలి కదా, మరి వెళ్లలేదే అనుకున్నాడతడు.

"మన సూరిగాడి బావమరిది హైదరాబాద్ వెళ్తుంటే, వాడితో పంపించానురా.. నీతో చెబుదామని మరిచాను"

కాసేపు పొలం విషయాలేవో చెప్పాడు మురళి. అన్నీ విన్నారు శాస్త్రి. మురళి చివర చెప్పాడు.

"మన వూళ్లో ఆస్పత్రి పెడతారట!"

"ఎవరు?"

"రుక్మిణమ్మట!"

లిప్తమాత్రం ఆ నొసట చికటేదో మెరిసి మాయమయింది. శాస్త్రిగారు లేచారు "పూజ కాలస్యమయింది—"

* * *

"గేటుకు ఆ ఎర్ర రంగేమీ బాగు లేదండీ.. తెల్లరంగే వేయించండి."

"అట్లాగేనమ్మా!"

"డాక్టరు గారుండబోయే ఇంట్లోబావికి పంపుపెట్టేశారా?"

"ఆ పని నిన్ననే అయిపోయింది కదండీ! పంపులోంచి నీళ్లు వచ్చేస్తుంటే జనమంతా బలే విడ్డూరంగా చూస్తున్నారు" అన్నాడు వెంకయ్యగారు.

నవ్వింది రుక్మిణమ్మ.

గౌరి తన మనవరాలు అయిదేళ్లది ఇట్లాగే నవ్వుతుంది అనుకున్నాడు వెంకయ్య తాత.

ఆయన రుక్మిణమ్మగారి ఆస్తిపాస్తుల వ్యవహారాలకు మేనేజర్ లాటివాడు. అది ఇన్‌కంటాక్స్ వారి ఇరుకు సందులే కానివ్వండి, సర్కారు చట్టాలలోని చిట్టడవులే కానివ్వండి వెంకయ్యగారు వాటిలోకి ఈల వేసుకుంటూ వెళ్లిపోయి, దారి తప్పకుండా వెనక్కొచ్చేయగలరు.

ఆయనంటే రుక్మిణమ్మగారికి విపరీతమయిన అభిమానం. వెంకయ్యగారూ, వెంకయ్యగారూ అంటూ ఆయన లేకుండా ఏ పనికీపూనుకునేది కాదు.

మరి ఆయనకో? ఆమె చాల విచిత్రమయిన, గొప్పమనిషి. తన పూర్వజన్మ సుకృతం వల్ల దేవుడు తన్నా చల్లనితల్లి దగ్గర పడేశాడు. అన్నది వెంకయ్యగారి మనసు.

చుట్టుపక్కల నలభై మైళ్లలో, ఎక్కడా మందుగాని సరైన డాక్టరు గాని

# రాధ కథా? రామ కథా?




వాకాటి పాండురంగ

లోక జనం తల్లడిల్లుతూంటే దాదాపు యాభై లక్షల వేల రూపాయలు పోసి ఆ భవనం కట్టించి దాన్లో మంచాలు, పడకలూ, ఏర్పాటు చేయించి ఇల్లు, భోజనం కాక నెలకయిదు వందల జీతం మీద డాక్టరును నియమించి మందులూ అవీ తెప్పించి—మొత్తం మీద పంపా పురంలో నారాయణయ్య ఆస్పత్రి అంటూ ఒక ఆస్పత్రిని నెలకొల్పిందావిడ. ఇంకో నెలలో ఈ ఆస్పత్రి తెరిస్తే, హమ్మయ్య! ఈ ఊళ్ళోని వెయ్యిమందికే కాదు, చుట్టు ప్రక్కల గ్రామాల వారికీ ఎంత పెద్ద సహాయం! రోజుకు ఎన్నిసార్లు మొక్కితే మా ఋణం తీరేను.

అని అనుకుంటూ నిల్చున్న వెంకయ్య కళ్ళు తడితడిగా లవడం చూసిన రుక్మిణమ్మ అడిగింది—"ఏమిటి, వెంకయ్య గారూ?"

ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకుని, "ఏమీ లేదమ్మా, ఒక మనిషి మంచితనం ఎంతమందిని ఉక్కిరిబిక్కిరి చేస్తుందో అనుకున్నా నంతే" అన్నాడు వెంకయ్య.

"మంచి అన్నది ప్రతిమనిషిలో వుంటుంది వెంకయ్యగారూ! కాని అది శాపగ్రస్త అయిన అహల్యలా జడంగా వుంటుంది. అహల్యను ఆ శ్రీరామచంద్రుడి పాదంవలె ఆ మంచిని తట్టాలిన ఏదో ఒకటి మేల్కొలుపుతుంది."

"అయినా ఈ గ్రామంలోనే కాదు, చుట్టుప్రక్కల కూడా కలవారు ఎంతమంది లేరు? మరి వారందరూ—" వెంకయ్యగారి మాటలకు అడ్డొచ్చింది రుక్మిణమ్మ.

"ష్! ఎవరి అభిప్రాయాలు వారివి. మనం ఎవరినీ ఏమీ అనరాదు. నేను ఖర్చు పెడుతున్నది మాత్రం నా డబ్బా? అంతా ఆ మహానుభావుడిది. ఆ పుష్పంతో గల పరిచయమే ఈ దారానికి మిగిలిన పరిమళం"

తల వూచాడు వెంకయ్య. రెండు నిముషాలు రుక్మిణమ్మ తన కుడిచేతి మీద ఎర్రరాళ్ళ గాజును చూస్తూ కూచుంది. ఉన్నట్టుండి వెంకయ్య అన్నాడు "అమ్మా. అదేదో పత్రిక నుండి ఒకాయన వస్తానని రాశాడు. మిమ్మల్ని కలుసుకోవాలట ఫోటో తీయాలట."

"అబ్బెబ్బె... అదెందుకూ? వాళ్ళని ఆస్పత్రి తెరిచే రోజున రమ్మనండి. మన డాక్టరు బాబుని కలుసుకోమనండి"

"కాదమ్మా..మిమ్మల్ని."

"వద్దు వెంకయ్యగారూ, వద్దు."

త్రివేణి సంగమం వద్ద సరస్వతిలా ఈమె కమ్మటి స్వరంలో అంతర్వాహినిగా ధ్వనిస్తున్నదే— అదేమిటి అని నిముషంలో సూరో వంతు కాలం అనుకుని వెంటనే మరిచిపోయాడు వెంకయ్య.

"మరి వస్తానమ్మా! దివ్యె పోస్టాఫీసులో పనుంది."

"బండి కట్టించుకు వెళ్ళండి" అంది రుక్మిణమ్మ. అట్లాగేనని ఆయన వెళ్ళి పోయాడు.


తాను కూర్చున్న చోటికి ఎదుటివైపు గోడ మీద వున్న పెద్ద ఫోటో వైపున్నాయి ఆమె కళ్ళు.

ఫోటోలో ఆయన తన వేలుపు. ఆయన తన వెలుగు.

ఆయన చూపు తన మీద పడకపోతే తానింకా ఆ బురదలోనే కూరుకుపోయుండేది. కాని ఏ జన్మలో చేసిన పుణ్యమో ఆయునగా వచ్చారు. తన జీవితాని కొక బాట వేశారు. లేకపోతే ఆ రంగులు—ఆరోగాలు—ఆ రూపాయలు— ఆ బేరాలు, అబ్బబ్బ ఒళ్ళు జలదరిస్తుంది. ఒకనాడు తమ కులంవారు దేవుడి సొమ్ము. వారికా నాడు మనసులే కాని శరీరాలుండేవి కావు. ఆ మనసులూ భగవదర్పితాలు.. కాని నేడో—మనసులు అసలు లేవు. మిగిలిన ఈ శరీరాలు బజారులో బేరాలు...

ఆయన నారాయణయ్యగారు తన్ను ఆదరించారు. చేరదీశారు. పుట్టుకనుండీ తన్ను దహిస్తున్న దావానలానికి అడ్డంగా చల్లటి అనిలమై నిలిచారు. తాను వద్దన్న కొద్దీ ఆయన భార్య సావిత్రమ్మ వుండగానే తన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఆసరికే సావిత్రమ్మ క్షయ బాగా ముదిరింది. ఆయన చేతనయిందల్లా చేశారు. లనామెను చూడ లేకపోయేది.. చివరకు, కన్నులు శాశ్వతంగా మూసే ముందామె మొదటిసారిగా తన్ను పిలిపించింది. పడక మీద కూచో పెట్టుకుని "రుక్మిణీ! ఆయున్ను చూచుకో" అంది.

అట్లాగే చేసింది తాను పదిహేడేళ్ళ పాటు. యాభై యేళ్ళయినా నిండకనే ఆయన వెళ్ళిపోయారు.. తను చేసిన పుణ్యం అంతే కాబోలు.. ఇరవయ్యవయేడు దాక తను బ్రతికిన బ్రతుకులోని కుళ్ళుని, దుర్గంధాన్ని జీవితాంతం ఆయనకు చాకిరి చేసి కడిగేసుకుందామని తన అంతరంగం మీది పచ్చి పుండ్లకు మందురాసి బాగు చేసి ఆచోట మంచితనానికి మల్లెలపందిరి వేద్దామని చేస్తున్న యత్నం సగంలోనే వచ్చిపోయింది.. పాతాళం నుండి తన్ను భూలోకానికి తెచ్చిన వారు తానింకా నిల బడక ముందే తప్పుకున్నారు.. అక్కడ నుండీ ఈ అన్వేషణ! తనలో లేని దానిని తెచ్చి నిలుపుకోవాలని ఈ ప్రయత్నం. ఈ ఆస్పత్రి అయినా ఆ ప్రయత్నంలో ఒక భాగమే. ఎవరికీ అర్థంకానిది, చెబితే నమ్మరు కూడా...



నారాయణ తన్ను తెచ్చినవాడు ఆయనను ఆడిపోశారు. సావిత్రమ్మ మరణించినపుడు తానే విషంపెట్టి చంపేసన్నారు. తను అనుబంధాలను ఎవరూ తెలుసుకోలేరు.. సంబంధాలు అర్థం కాకపోవచ్చు. అనుబంధాల లోతు అందకపోవచ్చు.. ఒక మనిషి లోని మంచి మరొక మనసులోని మంచిని ఎందుకు గ్రహించదు? ఒక పువ్వు నుండి గాలి తెచ్చిన గంధం మరొక్క పువ్వు తెలును కోలేదా? ఎందుకని—?

తమన్ను నుండి ఉషస్సులోకి అడుగు పెడుతున్న తనకు నారాయణ పోయాక దినకరుడై కనిపించినవారు హరిహర శాస్త్రిగారు.. ఆయన గురించి ఆలోచించినపుడెల్లా ఈ బాధే సరికొత్తగా పుట్టి పెరుగుతుంది...

తాను పుట్టిన చోట తాను పుట్టినందుకు తను బాధ్యురాలు కాదు. అయినా తనకు తెలియని వ్యథ తనలో రగులుతున్నది. తనొక్క గులకరాయి. శాస్త్రి గారొక మహామేరువు. తనొక గడ్డి పరక. శాస్త్రిగారొక మహావృక్షం. బురద లోని వానపాము తాను. వినువీధుల విహరించే వైనతేయుడాయన. తనలో లేనిది, తనకు కావలసినది, తాను కావాలనుకున్నది ఏదో, ఏమిటో, గొప్పది, ఎత్తైనది,ఎప్పుడూ చావనిది, ఎన్నడయినా తనకు అందునిందా అనిపించేది—ఆయనలో కాదు—ఆయన జీవితంలో వున్నది.

భగవాన్— ఈ ఆవేదనా కడలి కడచి తీరం చేరుతానా, లేక ఈ తరంగాలలో పడి ఈదలేక మునిగిపోతానా—

పంకంలో పుట్టినది పంకేరుహం కావాలనుకుంటున్నది. పరిశుభ్రంగా, ధవళ వస్త్రంగా ఆ పరమాత్ముని పాదాల వద్ద పద్మమై రాలిపోతే చాలు అనుకొని వద్దను కుంటున్నది.

ఈ 'శైల వాహిని యింకిపోకుండ
నవ్వ తోర్లవము జేరవలెయు చాలు
ఈ మల్లెల దండ యెండిపోకుండా
నవ తమూర్తి వహించె వంటి యొచాలు!'

ఆమె కనుకొలకుల నిలచిన నీరు వెచ్చగా ఆమె తెల్ల చీరపై పడి చల్లగా అయింది. నారాయణ ఫొటో కదలినట్లయింది.

*   *   *

"నాన్నగారూ! అన్నయ్య నుండి ఉత్తరం వచ్చి రెండువారాలు దాటింది" అన్నాడు మురళి. వాడి తత్తరపాటు చూసి శాస్త్రి గారికి నవ్వు వచ్చింది. ఆయన నవ్వనూ లేదు, వాలుక కదవనూలేదు.

ఈ విషయం మీద కాసేపు మాట్లాడి ఇంకో ఊసెత్తాడు మురళి. "పెద్ద నాన్నగా రబ్బాయి వీరభద్రం—మన పొలం విషయమై కోర్టు కెక్కుతానన్నారట. నిన్న సంతలో వాళ్ల పాలేరు చెప్పాడట మన రామిగాడితో—"

ఈ సారి కూడా హరిహరశాస్త్రి ముఖం మారలేదు. తలెత్తి కొడుకు నొక నిముషం చూసి ఊరుకున్నారు.

వీధిలో ఎద్దుల మువ్వల చప్పుడయింది.

"రమణాపురం నుండి విశ్వనాధయ్య వచ్చినట్లున్నాడు—" అన్నారు శాస్త్రిగారు కూచున్న చోట నుండి కదలకుండానే.

మురళి లేచి వీధిలోకి వెళ్లాడు.

"నమస్కారమండీ ! నాన్నగారున్నారా ?" అంటూ రెండెడ్లబండినుండి చెవిపోగుల కమలాలు తళుక్కుమంటుండగా దిగాడు విశ్వనాధయ్య. అతడికి కాళ్లకు నీళ్లిచ్చి లోపలకు తీసుకువెళ్లాడు మురళి. శాస్త్రి గారికి నమస్కరించి దూరంగా కూర్చు న్నాడు విశ్వనాధయ్య.

ఒకప్రక్క నిలబడిన మురళిని చూసి "మజ్జిగ తెమ్మని అమ్మమ్మకు చెప్పి నువ్వెళ్లు" అన్నారు శాస్త్రి. తనకు పరిచయం కాని శృతి నాన్నస్వరంలో వినిపించింది మురళికి. అమ్మమ్మతో విశ్వనాధయ్యకు మజ్జిగ ఇమ్మని చెప్పి వీధిలోకి నడిచాడు.

నడిచి నడిచి వూరి బయట చెట్ల గట్టు దగ్గర చింతతోపులో కెళ్లి కూర్చు న్నాడు మురళి. ఆ తోపులోని చెట్ల ఆకుల గలగలల వలె అతడి మనసూ కలవరపాటు చెందింది.

వారానికి రెండుత్తరాలు రాసే అన్నయ్య రెండు వారాల నుండి ఒక్కటయినా రాయక పోతే ఏమనుకోవాలి? ఉన్న రెండెకరాల భూమి పోతే, తిండి ఎట్లా సాగుతుంది? అసలు కోర్టుల వెంబడి తిరగటానికి డబ్బూ ఓపికా ఎక్కడి నుండి వస్తాయి? ఇవన్నీ నాన్నగారికి తెలియువా?.. ఛీ.. తనదెంత చిన్నతనం అనుకున్నాడు మురళి.

అచంచలమైన ఆయన విశ్వాసాని కష్టాలన్నవి లేవు కాబోలు. అందుకనే ఆయన అలా వుండగలరు. అమ్మ కన్ను మూసి రోజున తనూ అన్నయ్యా రోదిస్తుంటే తమ్మ లాలించి తానొకించుకయినా తొణక ధీరుడాయన... ముద్దనూరు జమీందారు వద్ద దివాన్ గిరిని, ఆ జమీందారు తగని పని ఒకటి చేశాడని వదిలేసిన మని ఆయన.. పెదనాన్న గారేదో మాట అన్నార యాభైవేల రూపాయల ఆస్తిని నిశ్చింతగా వదిలేసి ఈ రెండెకరాల మడి దున్నకుంటూ, కృష్ణా, భగవానుడే ఊపిరి బ్రతుకుతున్న యోగి ఆయన. అట్లాంటి ఆయనను కొలవడానికి తానెంతటివాడు ఆయన వుండగా తానెందుకంత కలవర చెందాలి?

అన్నయ్య వుత్తరం రాయకపోతే తా వాడికి రాయవచ్చుగా.. ఇవాళ మధ్యాహ్నం దివ్వెకు వెళ్లితే..


అబ్బే ఇవ్వాళ కుదరదు రేపే వెళ్ల ఇవాళ సాయంకాలం అమ్మవారి తెరుస్తారు ఊరంతా హడావిడిగా వుంది. ముందు ఎవరయితే పందు కోసం వెడితే వారే ప్రా భోత్సవం చేసినట్లుట! ఆ అద్భుత ఏ రోగిని వరిస్తుందో

నవ్వొచ్చింది మురళికి. ఆ నవ్వు సగం ఆగింది. పాపం ఆ రుక్మిణమ్మగారు, గారిని ఆస్పత్రికి వచ్చి అందరినీ ఆ దించి వెళ్లమని వెంకయ్య గారిని పంపి కాని నాన్నగారి కెందుకో ఈ అ విషయం అయిష్టంగా వున్నట్లు ఎందుకో మరి?

మురళి లేచి వెళ్లి చెరువులో స్నానం చేశాడు. హాయిగా చల్లగా వున్నాయి నీ స్నానం ముగించి, చెరువు గట్టు పిల్చుని వుండగా ఎద్దు మువ్వల చప్పుడు వినిపించింది. పని అయినట్లుంది నాధయ్య వెళ్తున్నాడు.

విశ్వనాధయ్య వెళ్లిపోయాక నిముషం కండ్లు మూసుకు కూర్చు హరిహరశాస్త్రి.

... విశ్వనాధయ్య వచ్చాడు. వెళ్ళాడు.



దుకు అని అనుకుని వుంటాడు మురళి. పై పెచ్చు, వాడిని తను వెళ్లిపొమ్మన్నాడు కూడాను. వాడికిదేమీ అర్థమయి వుండదు. ఏమిటాయన అనుకుని వుంటాడు.

ఇట్లాగే అనుకునేది లక్ష్మి కూడా. పైకి అనేది కూడా. "నాకేమీ బొత్తిగా బోధపడ్డం లేదు".. ఒక్కసారి మాట తప్పిన తన స్వంత అన్నగారి మొహం ఇహ చూడ కూడదనిపించింది. అట్లాగే చూడలేదు. ఈ విషయం లక్ష్మికి ఎన్నడూ అవగతమవ లేదు. హృదయం లేని మనిషనుకున్న దేమో.. ఆరు మారయినా అసత్య మాడిన వాడిని, నీతి తప్పినవాడిని వాడు, అన్నేకాదు స్వంత తండ్రే అయినా తాను గౌరవించ లేడు. ప్రాణమయినా పోవచ్చును గాని మనిషి మనోవాక్కర్మలా శీలాన్ని, ధర్మాన్ని విడువరాదు. ఆ చెక్కుచెదరని నిలకడ, ఆ నడవడి, ఆ నియమము ఇదే మానవ జన్మకు అర్థం. అది లేనినాడు మనిషి మనిషి కాదు. ధర్మబద్ధమైన జీవితమే దైవ స్వరూపం.

అందుకనే తాను ఆ అనుపత్రికి వెళ్ల లేదు. దానికి ప్రాణం పోసిన మనిషిని చూడలేదు. మంచిపనే కావచ్చు కాని చెడు సాధనాల ద్వారా సాధించిన దానిని తాను హర్షించలేడు. వివాహమన్న పవిత్ర బంధాన్ని తృణీకరించి, అగ్నిసాక్షిగా వివాహ మాడిన ధర్మపత్నిని కాదని, ఆ స్త్రీ వయస్సూ చెప్పిన మాటలు విని ఎగబడిన మనిషి మనిషా....ఛీ..

"వంట అయింది" అన్న అత్తగారి గొంతు వినబడింది

"మురళిని రానివ్వండి" అన్నారు శాస్త్రి.

* * *

అదో ఆలయ మంటపమది.

స్తంభాల మీది శిల్పాలు తలలూపుతు న్నట్లున్నాయి. ప్రేక్షకులు కనబడడం లేదు. వారి కళ్లే కనుపిస్తున్నాయి.

మెరుపులా మిన్నాగులా, మొగలి వాసనలో గాన మాధురి పరుగులిడుతూంది. ఇంత సంరంభానికి కేంద్రమై తాను నాట్య మాడుతున్నది. పరమశివుడూ, పార్వతీ గోపికలూ, గోపాలుడూ అన్నీ తానే అయి, ఆడుతున్నది. ఆ ఆటతో జగమంతా ఆడు తున్నది."

ఆ క్షణం..సంపూర్ణమయిన క్షణం.. ముందు వెనుకలు లేని, ఇంద్రియాలకు తెలియని, అపూర్వమయిన, అనిర్వచనీయ మైన ఆనందం ఆక్షణం. చావు బ్రతుకు



లొక్కటయి, చీకటి వెలుగులో లీనమయి మనిషే దేవుడయిన క్షణం.

ఆ ఆనందంలో ఆ ఔన్నత్యంలో 'సా విరహేతవదీనా రాధా' అని తాను రాధయ్యే అభినయిస్తుంటే శిల్పాలు కళ్లు తుడుచు కోసాగాయి... దివ్యమయిన దీప్తి నిండిన ఆ రెండు కళ్లూ.. అవి మాత్రం ఎందుకో మళ్లీ మళ్లీ తనకు కనబడినాయి. అన్ని వేల కళ్లలోనూ ఆ కళ్లను వెతికి అవి కనపడగానే అక్కడి సూర్యులను చూడలేక ఇటు తిరుగుతున్నాయి తన కళ్లు.

ఏదో అయింది.

కళ్లు తెరిచేసరికి తాను క్రిందపడివున్నది. ఆలయమంటపం వున్నది. కాని అశేష ప్రజానీకంలో ఒక్కరూలేరు. ఆడి అలసి నప్పటి చెమట తడి ఇంకా ఆరలేదు. కాలి గజ్జె లింకా విప్పనేలేదు. అందరూ ఏమయి నట్లు—?


ఎవరిది—ఆ స్తంభం ప్రక్కగా అటు మొహంపెట్టి రాజసంగా వెళ్లుతున్నదెవరు?

ఆజానుబాహుడు, అమరుడు ఎవరు?

"స్వామీ!" అని పిలిచింది తన యావజ్జీ వితమూ ఆ పిలుపులో నిలిపి, ఇటు చూడ లేదు. ఇంకొక్కసారి పిలిచింది. ఆ కళ్లు ఇటు తిరిగాయి. ఆశ్చర్యం!

ఆజానుబాహుడు అరవింద దళాయ తాక్షుడూ, నిశాచర వినాశకుడూ, పితృ వాక్య పాలకుడూ, అనవరత ధర్మపరాయ ణుడూ అయిన దాశరథి.. చూడ పదివేల కన్నులు చాలని ఆ మంగళ విగ్రహుడు శ్రీరామచంద్రుడు.

తనేదో అందామనుకుంది... అయ్యో! మరుక్షణం ఏమీలేదు!! కనుల ఎదుటకొచ్చిన ఈ కోదండరాముని తనివితీరా చూడలేక పోయింది. తానెంత దురదృష్టవంతురాలు..




పక్కనున్న రాతిస్తంభానికి తలనువేసి బాదు కుంది.

"అబ్బా" అని నుదురు పట్టుకుని లేచి కూచుంది రుక్మిణమ్మ. ఇంత మధ్యాహ్నం వేళ ఈ నిద్ర ఏమిటి, ఈ కల ఏమిటి.... కన్నులు మూసుకొని కలనొక్కసారి తలచు కోగానే తనువొక నందనవనమై పులక రించింది.

కాని ఒక నిజం విషాదకరమైన నిజం తటిల్లతలా తాకిందామెను. ఆమె నవ్వు కుంది.

'సా విరహే తవదీనా రాధా' అని అలమ టించే ఆ రాధ హృదయం ఆ నల్లనివా డొక్కడికే తెలుస్తుంది. అన్నాళ్ళు తనకు దూరంగా వుండిన సీతను రావణుడి చెర నుండి విడిపించినాక నిప్పులో దూకమన్న వాడికీ, ఎవడో ఏదో అన్నాడని నిండు చూలా లిని నట్టడవిలో వదలమన్న వాడికి ఆ శ్రీరాముడికి రాధ ఎట్లా తెలియ గలదు? నిజమే.. రాధతో రాముడు పలు కడు. నిజమే.. రాముడూ రాధా సమకాలి కులవడమంత విషాదం ఇంకేదీ వుండ బోదు!

ఫక్కున నవ్వేసింది రుక్మిణమ్మ.. ఏమిటి తన పిచ్చి..!

"అమ్మా! వెంకయ్యగారొచ్చారు.."

"హాల్లో కూచోమను ఒక్కనిముషం.."

మొహం కడుక్కుని హాల్లోకి వెళ్లింది రుక్మిణమ్మ. నమస్కారాలయ్యాక వెంకయ్య గారు "అమ్మా! దేవుడి దయవల్ల ఈ ఆరు నెలల నుండీ ఆస్పత్రి బాగా నడుస్తోంది. అవతలి వూళ్లవాళ్ళు కూడా వచ్చిపోతున్నా రమ్మా..."

తల ఆడించింది రుక్మిణమ్మ.

"డాక్టరు బాబు కూడా చాల మంచి వాడమ్మా.. మంచి చేయివాసి వున్న మనిషి. వయసులో చిన్న అయినా ఎంత నిదానం!"

"అంతా మీ ప్రయత్నం వెంకయ్య గారూ!"

"నాదేమిటితల్లీ—ఇది మీరు పెట్టిన భిక్ష."

"అట్లా అనకండి.. తప్పు..."

"ఇంకొక గొడవ వచ్చి పడిందమ్మా.. రమణాపురంలో, వీరాంలో కలరా సోకిం దట" ఉలిక్కిపడింది రమణమ్మ.

"డాక్టరు బాబుతో మాట్లాడండమ్మా ఏమన్నా మందులూ అవీ కావాలేమో"

"అట్లాగే!"

అది నిముషం సేపు మాట్లాడి వెం

కయ్య వెళ్ళిపోయాడు.

పదిరోజుల తర్వాత ఆ హాల్లోనే కండ్లు మూసుకుని కూర్చుని వున్నది రుక్మిణమ్మ.

ఇంతకన్న దురవస్థ ఏమున్నది.. ఆ కొంపలు ముంచే రోగం ఈ వూళ్ళోకి వచ్చింది.

తిండీ తిప్పలూ లేక అహోరాత్రాలూ పోరాడుతున్నారు ఆ డాక్టరూ నర్సులూ.. చుట్టుపక్కల గ్రామాలన్నిటికీ ఇదే ఆసుపత్రి అయింది. ఈ రెండువారాలలో ఎంతమంది—ఎంతమంది—అబ్బా.. తలచుకుంటే ఒళ్ళు కంపరమెత్తుతుంది.

తాను ఏదో కొంత చేద్దామని వస్తే ఆ డాక్టరూ, వెంకయ్యా తన్నేమీ చెయ్యనివ్వడంలేదు.

ఇవన్నీ చాలవన్నట్టు నిన్న సాయంత్రం నుండి శాస్త్రిగారికి కలరా సోకిందట!

"చచ్చినా చస్తాగాని ఈ ఆస్పత్రికి మాత్రం రాను పొమ్మ"న్నారట ఆయన. వాళ్ళ చిన్నబ్బాయి చెప్పాడని వెంకయ్య అన్నారు.

ఆయన.. ఆ మహోన్నత శిఖరం.. తన జీవితానికి ఆదర్శం శాస్త్రిగారు ఏమీ కాకూడదు.. ఆయన ఏమీ కాకూడదు.

పోనీ ఆ డాక్టరుని వాళ్ళింటికే వెళ్ళి మందివ్వమని తను కోరింది. ఆ డాక్టరు కాదు కదా ఆటు వేపు నుండి గాలి కూడా అటు రానక్కర్లేదన్నారట ఆయన.

అబ్బ! ఆ వజ్ర సంకల్పంతో అల్పురాలు తానెట్లా తలపడగలదు! తానేమి పాపం చేసింది.. తన జన్మకు తన వృత్తికి తను బాధ్యురాలా?

నారాయణను నమ్మి ఆయనకు సేదగా నిలవ యత్నించింది తను. మొదటి ఇరవై యేళ్ళ జీవితంలో గూడు కట్టుకున్న పాపానికి ప్రక్షాళనం చేయాలనుకుంది. ఈ ఇంట అడుగుపెట్టిన నాటినుండి తన బ్రతుకంతా ఆ ప్రయత్నమే. అయినా పలక మీది అక్షరాలు కావు గతపూర్తిగా చెరిపివేయడానికి... భగవాన్! ధర్మానికి ప్రతిరూపంగా వంద జన్మలకయినా నేను నడిచి చేరవలసిన గమ్యంగా ఆయనను ఎన్నుకున్నాను. ఆ మహాతపస్వి పదధూళి శిరసున దాల్చిన చాలుననుకున్నాను. ఆయన ఎదుట పడి ఎరగను. మాటాడి ఎరగను. అయినా ఆయన నా దైవం. ఆయన నా సత్యం. ఆయన నా దీపం...

ఆ దీపమీనాడు పెనుగాలికి రెపరెపలాడుతుంటే ఎట్లా భరించను.. ఎట్లా భరించను?

రుక్మిణమ్మ చెంపలపై కన్నీరు కాలువలుగా పారుతూంది...

...కన్నీరు కాలువలుగా పారుతూంది మురళి చెంపలపై.

రవితేజ విరాజితుడు మేరునగధీరుడు. మహానుభావుడు బ్రహ్మర్షి అయిన తన తండ్రి నీరసించి, అలసిపోయి, ముడుచుకుపోయి పడక మీద పడుకుని వున్నాడు.

ఆయన గొంతు బలహీనమయింది. అయినా ఆ కళ్ళల్లో వెలుగు!!

హరిహరశాస్త్రిగారి పెదవులు కదలినట్లనిపిస్తే కండ్లు తుడుచుకుని, ఆయన నోటి దగ్గరగా వంగి వినబోయాడు మురళి.

కళ్ళతో వద్దన్నారు ఆయన.

మురళి చెవులు నెమ్మదిగా పోల్చసాగాయి "కృష్ణకర్ణామృతం"లోని ఆ శ్లోకాన్ని.

వ్యత్యస్తపాద మవతంసిత బర్హిబర్హ
సాచీకృతానని నివేశిత వేణురంధ్రమ్
తేజః పరం పరమ కారుణికం పురస్తాత్
ప్రాణప్రయాణ సమయే మమసన్నిధత్తామ్

ప్రాణప్రయాణ సమయే!.. అన్న పంక్తి ప్రళయమై గర్జించింది. మురళి చెవులలో.

కట్టలు తెంచుకు పొంగిన దుఃఖాన్ని భరించలేక మురళి బావురుమని ఏడుస్తూ వీధిలోకి పరుగెత్తాడు. అపుడే ఊరి నుండి వస్తున్న వేణు చేతుల్లోకి వాలిపోయాడు.

మరునాడు ఉదయం సూర్యుడు ఉదయించలేదు. బాగా మబ్బు పట్టి వుంది.

పడక గదిలో ఒక పెట్టె ముందర కూర్చుని వుంది రుక్మిణమ్మ. ఆ పెట్టెలోని కాగితాలన్నిటిని పక్కకుంచి రెండు కాగితాలను తీసింది. ఆ రెండింటిలో ఒక దానిని తదేకంగా చూసింది.

అసలే గొలుసు అక్షరాలు ఇప్పుడింకా గజిబిజిగా వున్నాయి.

అది తన ఇంటిని రమణాపురం విశ్వనాథయ్యకు తాకట్టు పెట్టి రెండువేల రూపాయలు పుచ్చుకున్నట్లు హరిహరశాస్త్రిగారు రాసిచ్చిన పత్రం.

ఆ పత్రం మీద వేడి కన్నీటి బొట్టు రాలింది.

ఆ తడిని తన చీరకొంగుతో ఒత్తింది ఆమె.

ఆస్పత్రి తెరచిన రోజు సాయంత్రమే విశ్వనాథయ్య వచ్చి దీనిని, శాస్త్రిగారి ఇంటి పట్టానూ తన దగ్గర వుంచి రెండువేలూ పట్టుకెళ్ళాడు.

రుక్మిణమ్మ ఆ పట్టాను పెట్టెలో పెట్టి తాళం వేసింది. పత్రం తీసుకుని పూజ గదిలోకి వెళ్ళింది. దానిని పదేపదే చూసింది చాలసేపు చూసింది. కళ్ళు కద్దుకుంది. దేవుడి దగ్గరి ప్రమిదకు దానిని అర్పించింది. భగభగమని మండిందా కాగితం. బూడిదగా రాలింది.

రుక్మిణమ్మ పడకగదిలోకి వచ్చికూచుంది.

వేణుని పిలిపించమని వెంకయ్యగారికి చెప్పాలి అనుకుంది. కిటికీ బయటకు చూసింది.

ఆపాటికి వాన ఆగింది.

ఆకాశం శుభ్రంగా నిర్మలంగా వుంది. సూర్యుడు కొత్తగా వెలుగుతున్నాడు.

